క్లుప్తంగా

సంకటహర చతుర్థి పూజలు


హోమం నిర్వహిస్తున్న భక్తులు

నిర్మల్: మండలంలోని మేడిపల్లి గణపతి ఆలయంలో మంగళవారం సంకష్టహర చతుర్థి ఘనంగా నిర్వహించారు. అంగారక చతుర్థి కూడా కావడంతో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు కొనసాగాయి. స్వామికి పంచామృత అభిషేకం, గరక పూజలు చేశారు. పల్లకీసేవ, నూతన వస్త్రాలంకరణతో పాటు స్వామివారికి క్వింటాల్ పసుపు, 50కిలోల కుంకుమ, 108 కొబ్బరికాయలను సమర్పించారు. అనంతరం దంపతులు లక్ష్మీగణపతి హోమం చేశారు. కార్యక్రమంలో ప్రధాన పూజారి ప్రవీణ్, వడూరు రాజు, దీపక్, భక్తులు పాల్గొన్నారు.

చైనామాంజా విక్రయిస్తే చర్యలు

లోకేశ్వరం: చైనామాంజా విక్రయిస్తే.. ఎంతటి వారినైనా వదలబోమని కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుమాంజలి అన్నారు. మంగళవారం కుంటాల మండలం కల్లూర్ గ్రామంలో పలు కిరాణా దుకాణాలను ఎస్సై తనిఖీ చేశారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

శబరికి తరలిన స్వాములు

భైంసా: 41 రోజుల మండల దీక్ష పూర్తి చేసిన అయ్యప్ప స్వాములు మంగళవారం భైంసా నుంచి శబరికి బయలుదేరారు. భైంసాలోని అయ్యప్ప ఆలయంలో ఇరుమడులు కట్టుకొని ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

గురుకులం సందర్శించిన 'పీఎంశ్రీ' బృందం


గురుకులం వద్ద అధికారులు

కడెం: మండలంలోని నచ్చన్ఎల్లాపూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయాన్ని మంగళవారం పీఎం శ్రీ నోడల్ అధికారి డీఎల్ఎన్ చారి, సుదర్శన్ సందర్శించారు. నాణ్యమైన విద్య, బోధనోపకరణాలు, పరిశుభ్రత, వసతుల గురించి చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగన్న, ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండల కేంద్రంలోని విద్యా విలీన కేంద్రంలో మంగళవారం దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. 23 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. దివ్యాంగులకు ప్రతి మంగళవారం నిర్వహించే ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ భూమన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

మంచి భోజనం అందించాలి


వివరాలు తెలుసుకుంటున్న చైర్మన్ రాజేందర్

ఖానాపూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నిర్వహణతోపాటు విద్యార్థుల హాజరు వివరాలు, మన ఊరు–మన బడి పనులు పరిశీలించారు. కౌన్సిలర్ కావలి సంతోశ్, కమిషనర్ రత్నాకర్‌రావు ఉన్నారు.

'ఓపెన్' విద్యలో ప్రవేశాలు

లోకేశ్వరం: ఓపెన్ ఇంటర్, పదో తగతిలో ప్రవేశం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిదని కుంటాల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 13 లోగా అడ్మిషన్ పొందాలని.. వివరాలకు 855 58 38196 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వైద్యసిబ్బందికి శిక్షణ

కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం వైద్యసేవలపై ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐ, ఈఎన్టీ, ఎమర్జెన్సీ సేవలపై హెల్త్ ఎడ్యుకేటర్ జయలలిత శిక్షణ ఇచ్చారు. లలిత, నిర్మల, ప్రేమలత, గోపాల్ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో సీఎంరావ్ గార్డెన్ ఫంక్షన్‌హాల్లో మంగళవారం ఎల్లాపి సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కుల సంఘాలు ఐక్యమత్యంతో అబివృద్ధి పనులు చేసుకోవాలని నాయకులు పేర్కొన్నారు. టీజీవో అధ్యక్షులు శ్యాంనాయక్, రాజేందర్, ఖలీల్, శంకర్, గంగాధర్, సురేశ్, మెహరాజ్, శోభన్, రామారావు, జలపతిరావు ఉన్నారు.

గ్రామాల్లో నిఘా నేత్రం

- నేరాల నియంత్రణపై పోలీస్‌శాఖ దృష్టి
- 21జీపీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు
- ఎప్పటికప్పుడు అధికారుల పరిశీలన
- కేసుల ఛేదనలో కీలకపాత్ర పోషిస్తున్న వైనం


కోతల్‌గాంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరా


సీసీటీవీ ఫుటేజీ పరిశీలిస్తున్న ఎస్సై శ్రీకాంత్

భైంసారూరల్: శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అందులో భాగంగా గ్రామాల్లో దాతల సాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తోంది. దొంగతనాలు, కొట్లాటలు జరిగిన సమయంలో ఈ కెమెరాల్లో నమోదైన రికార్డుల ఆధారంగా పోలీసులు కేసులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుంటున్నారు. ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని.. ఏవైనా నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగినపుడు నిందితులను వెంటనే పట్టుకునే వీలుంటుందని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

దాతలు, వీడీసీల సహకారంతో..

భైంసా మండలంలో 30 పంచాయతీలుండగా భైంసారూరల్ పోలీసులు 21 పంచాయతీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీడీసీ(గ్రామ అభివృద్ధి కమిటీ)లు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించి యువకులు, దాతల సహకారంతో గతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. బిజ్జూర్‌లో 12, బోరిగాం 05, చింతల్‌బోరి 08, దేగాం 17, ఎగ్గాం 04, ఇలేగాం 06, హంపోలి 06, కామోల్ 16, కోతల్‌గాం 06, కథ్‌గాం 05, మహాగాం 08, మాంజ్రి 10, మాటేగాం 06, పాంగ్రి 13, పేండ్‌పెల్లి 09, సిరాల 04, సుంక్లి 16, తిమ్మాపూర్ 17, వాలేగాం 13, వానల్‌పాడ్ 06, వాటోలిలో 12 సీసీ కెమెరాలను బిగించారు. వీటి కోసం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్‌కు అనుసంధానించారు. ఈ పంచాయతీల పరిధిలో ఏవైనా ఘటనలు జరిగితే సీసీ కెమెరాలను పరిశీలించి అందులో రికార్డయిన దృశ్యాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. వీటి ఆధారంగా కేసులు త్వరితగతిన పరి ష్కారం అవుతున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

దొంగను పట్టించిన సీసీకెమెరాలు

రెండు నెలల కిందట తిమ్మాపూర్ సమీపంలో బైక్‌పై వెళ్తున్న ఇదే మండలంలోని కోతల్‌గాం గ్రామానికి చెందిన భూమన్నను కొందరు వ్యక్తులు ఆపి వాహన పత్రాలు చూపించాలని అతని వద్ద ఉన్న రూ.రెండు లక్షల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు వానల్‌పాడ్, తిమ్మాపూర్ గ్రామాల్లో ఉన్న సీసీ కెమెరాల్లో ఫుటేజీ పరిశీలించి డబ్బులు ఎత్తుకెళ్లిన మహ్మద్ జహీర్‌ను నిర్మల్‌లో పట్టుకున్నారు. అతడి నుంచి రూ.1.25 లక్షలు స్వాధీనం చేసుకొని భూమన్నకు అందజేశారు. ఇక్కడ నిందితుడ్ని పట్టించడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషించాయి.

కెమెరాల ఏర్పాటుతో భరోసా



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో మాకు భరోసా ఏర్పడింది. ప్రధాన వీధులు, కూడళ్లలో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అన్ని మార్గాల్లో రాకపోకలు అందులో రికార్డయ్యేలా చూడాలి. సరైన వారికి నిర్వహణ బాధ్యతలు అప్పగించాలి. – శంకర్, వాలేగాం

వేగంగా కేసుల ఛేదన

గ్రామాల్లో ఏవైనా ఘటనలు జరిగితే పంచాయతీల్లోని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నాం. రోడ్డు ప్రమాదం, దొంగతనం కేసులు ఛేదించేందుకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. – శ్రీకాంత్, భైంసారూరల్ ఎస్సై

అన్ని పంచాయతీల్లో ఏర్పాటు చేయించాలి..

భైంసా మండలంలో ఇప్పటికే 21 పంచాయతీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా.. మిగిలిన తొమ్మిది గ్రామాల్లోనూ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వీటి నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని పోలీసులకు విన్నవిస్తున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- నర్సాపూర్(జి) మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రేఖ



మాట్లాడుతున్న ఎంపీపీ కొండ్ర రేఖ

నర్సాపూర్(జి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ కొండ్ర రేఖ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి విన్పించారు.

- ఎంఈవో కస్తూరి శంకర్ మాట్లాడుతూ మన ఊరు–మన బడిలో భాగంగా మండలంలో ఏడు పాఠశాలలు ఎంపికవగా బూర్గుపల్లి(జి) ప్రాథమిక పాఠశాల, నర్సాపూర్(జి) ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు.
- మండల వ్యవసాయాధికారి సాయికిరణ్ మాట్లాడుతూ క్లస్టర్ ఏఈఓలు సర్వేనంబర్ల వారీగా పంటల వివరాలు నమోదు చేస్తున్నారని రైతులు సహకరించాలని కోరారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో భాగంగా 262 మంది రైతుల ఈ–కేవైసీ వివరాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పీఏసీఎస్, డీసీఎంఎస్ కేంద్రాల్లో యూరియా 5,236 బ్యాగులు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు.
- మండల పశువైద్యాధికారి గోవర్ధన్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోని పశువులకు లంపీ స్కిన్ వ్యాక్సినేషన్ చేపట్టామని.. త్వరలో పూర్తవుతుందన్నారు.
- మత్స్యశాఖ మండలాధికారి మహమ్మద్ గయాసుద్దీన్ మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థిక ప్రగతి సాధించేలా మండలంలోని అన్ని చెరువుల్లో చేపపిల్లలను వదిలామని పేర్కొన్నారు. గొల్లమాడ, నర్సాపూర్(జి) గ్రామాల మత్స్యకారులకు సంఘ భవనాల కోసం నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.
- ఎంపీటీసీ మల్లేశ్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ప్రజాప్రతినిధులకు (ఆరోగ్య కమిటీ సభ్యులు)సమాచారం ఇవ్వకుండా కంప్యూటర్ ఆపరేటర్, సెక్యూరిటీ, అటెండర్ పోస్టులను ఎలా భర్తీ చేస్తారని ప్రశ్నించారు. ఏ ప్రాతిపదికన పోస్టులు భర్తీ చేశారో తెలపాలని వైద్యాధికారి వరుణ్‌కుమార్‌ను నిలదీశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భర్తీ చేసినట్లు వైద్యాధికారి సమాధానమిచ్చారు. కార్యక్రమంలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, ఎంపీడీఓ అల్లాడి వనజ, తహసీల్దార్ శ్రీకాంత్, వైస్ ఎంపీపీ మ్యాదరి లక్ష్మీ, ఎంపీటీసీలు నర్సమ్మ, రాజవ్వ, మంగుబాయి, కోఆప్షన్ సభ్యులు ఫసి పాల్గొన్నారు.

రోడ్లపై కేజీవీల్స్ నడిపితే కేసు


బోరిగాంలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సారంగపూర్: రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు నడిపితే డ్రైవర్‌తోపాటు యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గోపాల్‌పేట్, ధని, జామ్, బోరిగాం, సాయినగర్ గ్రామాల్లో పోలీసులు కేజీవీల్స్ ట్రాక్టర్లతో కలిగే నష్టాలను వివరించారు. కేజీవీల్స్‌తో నడిపితే రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్లు దెబ్బతింటున్నాయని అన్నారు. తప్పనిసరైతే ప్రత్యేకంగా తయారు చేయించిన ట్రాలీలో పొలాల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు.

నిర్మల్‌టౌన్: బీటీ రోడ్లపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కేజీవీల్స్ ట్రాక్టర్లను పొలాల వద్దకు తీసుకెళ్లడానికి ప్రత్యేక ట్రాలీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు నిబంధనలు పాటించకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కేసు నమోదు

లక్ష్మణచాంద: మండల కేంద్రం నుంచి కంజర్ గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డుపై వెళ్తున్న కేజీవీల్స్ ట్రాక్టర్‌ను పట్టుకుని యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


లబ్ధిదారుడికి చెక్కు అందిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

లక్ష్మణచాంద: పేదప్రజలకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంగళవారం మంత్రి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన తొమ్మిది మందికి మొత్తం రూ.3,82,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు అల్లోల సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న డీఎల్‌పీవో శివకృష్ణ

లోకేశ్వరం: గ్రామాల అభివృద్ధిపై మండలాధికారులు దృష్టి సారించాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 2023–24 జీపీడీపీ నిధులపై ఒకరోజు వివిధ శాఖల అధికారులకు శిక్షణ నిర్వహించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి చేపట్టే యాక్షన్ ప్లాన్‌ను వివరించారు. ఎంపీడీవో సల్మాన్ రాజ్, ఏఈ శివకుమార్, ఏవో గణేశ్ పాల్గొన్నారు.

ఈరోజు

ఖానాపూర్‌కు మంత్రి రాక

ఖానాపూర్: పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో నిర్మించిన గిరిజన భవన్ ప్రారంభోత్సవానికి బుధవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ హాజరవుతారని బీఆర్ఎస్ పట్టణ, మండలాధ్యక్షులు సురేశ్, రాజగంగన్న తెలిపారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రెండో విడత కంటివెలుగు సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

దేవరకోటలో కుడారై ఉత్సవం

నిర్మల్‌టౌన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని దేవరకోట వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి కుడారై వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఏర్పాట్లు చేశామని.. భక్తులు తరలివాలని కమిటీ సభ్యులు కోరారు.

హిందీ దినోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం హిందీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హిందీ అధ్యాపకుడు అబ్దుల్ హమీద్‌ను సిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంతోశ్‌రెడ్డి, రజిత, నాగరాజు, రవీందర్, ప్రశాంత్, నరహరి, మోహన్, శ్రీనివాస్ ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రూరల్ సీఐ వెంకటేశ్

నిర్మల్‌టౌన్: దివ్యాంగులను కించపర్చడం నేరమని.. వారు ఆత్మనూన్యతకు గురయ్యేలా మాట్లాడటం సరికాదని దివ్యాంగుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సొట్టి సాయన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేష్ ఆధ్వర్యంలో దివ్యాంగుల చట్టం 2016 సెక్షన్ 92కు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్, దివ్యాంగులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. స్లాబ్‌కు మరమ్మతులు చేయరూ



కుభీర్: మండల కేంద్రంలోని బట్టిగల్లీలో మురికి కాల్వపై ఉన్న స్లాబ్ కూలిపోయి ఏడాది దాటినా ఇప్పటికీ నిర్మించలేదు. రాకపోకలు సాగించేవారు ఇందులో పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ప్రశ్నించాల్సిన అధికారి: విజయ్, ఈవో, ఫోన్:7396916252

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి


సర్దార్‌సింగ్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వాసవి ఉన్నత పాఠశాలలో గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం బోథ్ మండలం సోనాల సమీపంలోని తండాకు చెందిన మట్ట సర్దార్ సింగ్(35) ఎనిమిదేళ్లగా వాసవి పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాలలో గుండెపోటు రావడంతో తోటి ఉపాధ్యాయులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్యకు 20 రోజుల కిందట కుమార్తెకు జన్మించింది. ఈ ఘటనపై తోటి ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని వట్టోలి గ్రామంలో పిప్రి దేవన్న, అబ్దుల్లాపూర్‌లో స్వామిగౌడ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను ముధోల్ అసెంబ్లీ బీజేపీ నాయకులు రామారావు పటేల్ పరామర్శించారు. వారి వెంట బీజేపీ నాయకులు మంద భాస్కర్, మంద గణేశ్, జయసాగర్, లింగారెడ్డి, సాయన్న, రమేశ్ ఉన్నారు.

పార్డి(బి)లో..

కుభీర్: మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన ఎరేకర్ రుక్మాబాయి ఇటీవల మరణించగా మంగళవారం బాధిత కుటుంబసభ్యులను ముధోల్ నియోజకవర్గ నాయకులు పవార్ రామారావ్ పటేల్ పరామర్శించారు. వారి వెంట మాజీ సర్పంచ్ సిరాజ్, డాక్టర్ పోశెట్టి, సాయినాథ్, పోతన్న, నారాయణ్ ఉన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	40
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	50
ఉల్లిగడ్డ	25
ఆలుగడ్డ	30

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : ధమాకా
నారాయణ : తెగింపు
వెంకటేష్ : లాఠీ

క్రీడలతో ఆరోగ్యవంతులుగా మారుతాం


పోటీలను ప్రారంభిస్తున్న రామారావ్ పటేల్

లోకేశ్వరం: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారుతామని.. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆటలను భాగం చేసుకోవాలని బీజేపీ నాయకుడు రామారావ్ పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో నోముల దేవారెడ్డి స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 30 జట్లు పాల్గొంటున్నాయని.. విజేతకు రూ.33,333, రన్నర్‌ప్‌గా నిలిచిన జట్టుకు రూ.15,555 అందజేస్తామని పేర్కొన్నారు. పలువురు బీజేపీ నాయకులు సాయన్న, జయసాగర్, లింగారెడ్డి, భోజన్న, మహేందర్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

'నిరుద్యోగులపై ప్రభుత్వం చిన్నచూపు'


మాట్లాడుతున్న బీజేవైఎం నాయకులు

ఖానాపూర్: నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్ అన్నారు. మంగళవారం పట్టణంలో జరిగిన బీజేవైఎం సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లో కనీసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గ్రంథాలయం ఏర్పాటు చేయలేదన్నారు. పలు పాఠశాలలకు ప్రహరీ లేక కోతులు, పందులు, పశువులు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సల్కం సాయి, అన్న పెన్న శేఖర్, పంబాల ప్రశాంత్, గారిగంటి సాయి, సట్ల రాము, ఎనుముల ప్రశాంత్, అరుణ్, నాగేంద్ర, నరేశ్ పాల్గొన్నారు.

భగీరథ పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు

ఖానాపూర్: పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలో శాంతినగర్‌లో ఏర్పడిన భగీరథ పైపులైన్లకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ రత్నాకర్ రావు, కౌన్సిలర్ కావలి సంతోశ్ ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేశారు. పట్టణంలో ఎక్కడైనా పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పలువురు నాయకులు ఉన్నారు.

విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: పట్టణంలోని ఖానాపూర్ పీఏసీఎస్‌లో పలు రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఈవో భూమి ఆశన్న తెలిపారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 25 కేజీల 1010(అజార్ దస్, బస్తా రూ.850, 25 కేజీల కేఎన్ఎమ్118 బస్తా రూ.830, నువ్వులు(జడకాత, రెండు కేజీల బస్తా రూ.500, జనుములు 40 కేజీల బస్తా రూ.3000లకు విక్రయిస్తున్నామని వారు పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముథోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899